# నిషా

"రాజమండ్రి టేకుతో సోఫాలు జెయ్యమని నువ్వు చెప్పినా నేనొప్పుకోను సార్! ఆ సోపాలేస్తే మనింటికే హంగుండదు.సోఫాలు జేస్తే రోజ్‌వుడ్‌తోనే జెయ్యాల... చూసేదానికి రెడీమేడ్ సోఫాలు మొదుట్లో బాగనే వుంటాయి. అయితే రెండు మూడేండ్లకంతా పాతబడిపోతాయి. యిరవై ఘనపడుగుల కొయ్యతో దిట్టంగా సోఫాజేసి, పాలిస్ బట్టిస్తే దాని ముందర యీ రెడీమేడ్ సోఫాలు దేనికి పనికొస్తాయి? యిరవయ్యేండ్లయినాంక అవిట్ని అమ్మినా కొయ్యదుడ్డు మళ్ళా చేతిలోకొస్తాది. చెన్నయిలో రెడీమేడ్ సరుకులెన్ని దొరకవు? యెంపీ గౌతమ్‌రెడ్డి తమ్ముడు మదనమోహనరెడ్డి చెన్నయిలో యిల్లు గట్టించినప్పుడు కొయ్య పనంతా నాదే! మొత్తం సమత్సరం వాళ్లింట్లోనే పన్లుజేస్తా వుండిపోయినాను. తలుపులూ, కిటికీలూ అన్నీ బలార్షాటేకు. ఫర్నీచరు మాత్రం రోజ్‌వుడ్. యెప్పుడైనా చెన్నయికి పోతే వొకడుగు వాళ్ళింటికి పొయ్యి చూసేసిరా! అంత దూరమెందుకు? వాళ్ల పిన్నమ్మ కొడుకు క్రిష్ణారెడ్డి యిక్కడ్నే విద్యానగర్‌లో యిల్లు గట్టించినాడు. నన్ను తప్ప యింకెవుర్నీ యింట్లోకి జేర్చడు. ఆ సోఫాలూ, తలుపులూ వొకతూరి చూసేసొద్దాంరా! రోజ్‌వుడ్డు బయిటి డిపోల్లో దొరకదు. మావోడొకడు నంద్యాల నించీ తెచ్చిస్తాడు. బ్లాక్‌లో రేటు అడుగు మూడువేలదాంకా వుంటింది. అయినా నష్టంలేదు. రోజువుడ్డంటే బంగారం మాదిరి. రేటు పెరిగేదేగానీ తగ్గేదుండదు..." వుత్సాహంగా చెప్పుకుపోతున్న పరమేశాచారి హడావుడిగా యింటి లోపలికొచ్చిన కుర్రాడికేసి అనుమానంగా చూస్తూ ఆగిపోయాడు.

యెనిమిదడుగుల యెత్తున్న మట్టిమిద్దెలోపల, యినపకమ్ముల నవారు మంచంపైన కూర్చున్న వ్యక్తి ముఖం చిట్లించుకుని చుట్టూ తలతిప్పిచూశాడు.

అస్థిపంజరపు యెముకల్లా మట్టిమిద్దెవాసాలు కిందికి వంపులు తిరిగిపోయివున్నాయి. మిద్దెపైన వేసిన సుద్దమట్టి చాలా రోజులుగా రాలుతూ వుండడంతో వాసాల మధ్య బొరకలు పడివున్నాయి. యెన్నో సంవత్సరాలుగా సున్నపు పూతను మరచిన గోడలు నల్లబారిపోయి వున్నాయి. వంటగది ద్వారబంధాలకు వొకప్పుడక్కడ తలుపులుండేవన్న సూచనలు సైతం మిగలలేదు. హాలుమూలలో వెదురుకర్ర దండెంపైన పాతగుడ్డలు చిందరవందరగా వేలాడుతున్నాయి. హాలులో పాత ట్రంకుపెట్టెలు రెండు, పేళ్ళు లేసిపోయిన స్టూలు, దానిపైన పాత బ్లాక్ అండ్ వైట్ టీవీ తప్ప మరో వస్తువేదీ లేదు. గోడపైన దేవుడి బొమ్మలున్న కాలెండర్లు రెండూ, వొకపాత ఫోటో వేలాడుతున్నాయి.

"వీడు మా వోడేసార్! కొంచెం అర్జెంటు పనుండాది. యిప్పుడే వచ్చేస్తాను..." అని చెబుతూనే పరమేశాచారి యింట్లోంచే సరసరా బయటి కొచ్చేశాడు. కుర్రాడి చెవుల్లో రెండు మాటలు గొణిగాక గబగబా యింటివెనకున్న అడుగు వెడల్పు సందులో బల్లిలా గోడకతుక్కుని నిల్చున్నాడు. ఆందోళనతో అతడి గుండె డబడబమని కొట్టుకుంటున్న

చప్పుడు అతడికి స్పష్టంగా వినబడసాగింది. సందులో గాలి ఆడకపోవడంతో అతడి వొళ్ళంతా చెమటలు పట్టసాగాయి. పెరడులోంచీ వస్తున్న మురికినీళ్ళు యింటి చుట్టూ తిరిగి వెనక సందులోకి రావడంతో నేలంతా చిత్తడి చిత్తడిగా వుంది. మురికి నీళ్ళలోంచీ వస్తున్న వాసన ముక్కుల్ని అదరగొడుతోంది.

గోడ వెనకదాక్కున్నా యింట్లో యేం జరుగుతుందో తనకు స్పష్టంగానే కనబడుతున్నట్టుగా అనిపించసాగింది పరమేశాచారికి. కుక్కి మంచంలో కూర్చున్న బాంకీ మేనేజరు యేం జరుగుతోందో అర్థంగాక బిక్కమొహం పెట్టుకుని వుంటాడు. వంటింట్లోంచీ తన భార్య యెంతకూ బయటి కొచ్చి వుండదు. తనను దాక్కోమని హెచ్చరించిన ఆనందాచారి యీపాటికి సందు రెండో వైపు నుంచీ పారిపోయివుంటాడు.

యింటి గడప ముంగిటి నుంచీ చెప్పుల శబ్దం వినవస్తోంది.

"ఆచారెక్కడ?" జగన్నాథంనాయుడి గొంతులో కోపమూ, వుక్రోశమూ పెల్లుబుకుతున్నాయి.

"లేదన్నా! మిషినీ కాడికి పోయినాడు" అది భార్యగొంతు.

"సైకిలు యింటి ముందర్నే వుండాది. మధ్యాహ్నం అన్నానికి గూడా యింటికి రాకుండా ఆమనిషెట్లబోతాడు?" జగన్నాథంనాయుడు అరిచాడు.

"కుచ్చోన్నా!వచ్చేస్తాడు" ఆమె గొంతు వణుకుతోంది.

అసలే నల్లగా రాతి విగ్రహంలా కఠినంగా కనిపించే జగన్నాథం నాయుడి ముఖం యిప్పుడెంత ధుమధుమలాడుతూ వుంటుందో పరమేశాచారికి స్పష్టంగా కనబడుతున్నట్టే వుంది. ఆరడుగుల యెత్తున్న అతడి ముందు అయిదడుగులుండే తన భార్య యెలా ముద్దాయిలా నిలబడి వుందో కళ్ళెదుట జరుగుతున్నట్టే అనిపించసాగిందతడికి.

"పనులెగ్గొట్టి మీ యిండ్లల్లో కాపుగాసేదేనా నా పని? అయినా యీ కొంపలో యేడ గుచ్చోమంటావు? ఘనపడుగులు ఘనపడుగులు అంటా యెంత కొయ్యనయినా మింగేస్తావుండాడు గదా! యింట్లోకి రెండు కుర్చీలుగూడా చేసుకోకుండా అంతా తాగి తందనాలాడతా వుండాడా?"

"మా ఆచారికా మాదిరి పాడు అలవాట్లు లేవన్నా! అంతా కండ్లు గుట్టినోళ్ళు చెప్పేమాటలు...నమ్మదు..."

"తూ! దొంగనా..."

కోపమొచ్చినప్పుడు జగన్నాథం నాయుడెంతగా వణికిపోతాడో, పాములా యెలా బుసలు గొడతాడో, అప్పుడతడి గొంతెలా పెగలదో పరమేశాచారి తలచుకోసాగాడు.

"ఆచారి మీ యింట్లో పనిజేస్తావుండాడా?"బాంకు మేనేజరుఅడిగాడు

"అది చెప్పు! అందుకే నీకు గూడా యీ సందుల్లో యెతుకులాడతా తిరిగేరాత రాసుండాది. మన గహచారం.."

జగన్నాథం నాయుడు అతడిపైన కూడా నిప్పులు కురిపిస్తున్నాడు.

"క్రిష్ణానగర్‌లో మా యిల్లు...నేను కువ్వంబాదురులో గ్రామీణ బాంకీ మేనేజరు..."

"యింటి పనా? ఫర్నీచరా?"...

"యింటికి స్లాబు పడింది... తలుపులూ కిటికీలు జేస్తావుండారు. పనిలో పనిగా ఫర్నీచరు గూడా..."

"ముందు యింటి పని ముగించుకొని యీ మనిషి దగ్గిర్నించీ బయిటపడు... అదురుష్టంబాగుంటే మల్లంక ఫర్నీచరు గురించి చూసుకో...లేకపోతే నా మాదిరిగా అగోరిస్తావు..."

"మీ యిల్లెక్కడ?"

"తుడా ప్లాట్‌లలో... అనుభవంపైన చెప్తావుండాను. యీ దగుల్బాజీ మనిషిపైన వొక కన్ను పెట్టుండు. యింట్లో యామారద్దండి. వీని దగ్గిరుండే ఆచార్లు యింగా పలాతనమైనోళ్లు. మొన్నొకనాడు యింట్లో మొగోళ్ళు లేంది జూసి తాగేసొచ్చి ఆడోళ్ళతో యేందో కూసినారు. నాతో బెట్టుకుంటే గొమ్మునుంటానా? పోలీస్టేషన్లో రిపోర్టిచ్చినాను. వీడెంత? వీని బతుకెంత? చూపిస్తాన్నేనంటే యేందో? యిప్పుడు చేసిన తప్పుకు జైల్లో గుచ్చోవాల్ల యింటికొచ్చి పనీ ముగించాల్ల..."

"యీ మాత్రం దానికి పోలీసుల దాకా ఎందుకులేన్నా! మా కూత దుడ్డు మీ పక్కనే వుండాది గదా! అంతగా అయితే ఇంకో ఆచార్ని పిలుచుకో" పరమేశాచారి భార్య ప్రాధేయపడసాగింది.

"నేనే మారకుండా మీదుడ్డే నావక్కుండేట్టుగా జూసుకుంటా వుండంగానే యిట్లుండారు మీరు! ఆడదిగదా అని గొమ్మునుండాన్నేను... సాయంత్రం దాంకా చూస్తాను. ఆ మనిషి యింటికొచ్చి పనిలోకి దిగినాడా, సరే! యిప్పటికే పోలీసులు యెతకతా వుండారు. ఆ మనిషికి దాంకోవాలంటే వుండే వొకేవొకతావు మాయిల్లోగటే! యింకేదున్నా పోలీసుకుక్కలు యీడ్చిపారేస్తాయి... అసలే నేను మంచోడ్నిగాదు..." క్రమంగా అతడిగొంతు దూరమవుతున్నట్టుగా వినబడుతోంది.

"వూరోళ్ళు జెప్పే మాటలు యింటా వుంటే నాగ్గూడా బయింగా వుండాది. మీ ఆచారి నన్ను దేంట్లో ముంచతాడో..

నేనూ పోతాను..." బాంకు మేనేజరు వెళ్తూ వెళ్తూ యింటి తలుపును విసుగ్గా పక్కకు తోసినట్టున్నాడు. చెదలుపట్టిన తలుపు అరిగిన చిలుకులతో కీసుకీసుమని అరుస్తోంది.

"మా ఆచారి అట్లాంటోడుగాదు... వీళ్ళమాటలు నమ్మద్దుసాం..." ఆమె గొంతు నీరసంగా మూలుగతోంది. "అయిన పలుకుబడుండే మనిషి సా... అయితే పని మొదులు పెట్టినప్పట్నించీ సరింగా కూలీలియ్యటం లేదు. వూరికే పన్లుజేసేదానికి యెవురి వల్లయితింది? వాళ్ళపని పక్కన బెట్టినామని కడుపుమంటతో తప్పుడు రిపోర్టిచ్చినాడు. పోలీసులు ఆయన మాటే యింటారుగానీ మా మాట యింటారా?..." క్రమంగా పెరుగుతున్న ఆమె గొంతు బాంకుమేనేజరు వెళ్ళిపోతున్నాడన్న విషయాన్ని తెలియజేస్తోంది.

పరమేశాచారి చెవులు రిక్కించి వినసాగాడు. దూరంగా వీధిలో మోటారుబైకు డబడబమంటూ మోగుతోంది.

ముక్కును చేతితో మూసుకుని పిల్లిలా సందులోంచీ బయటికొచ్చి, సందులోంచీ నూరడుగులు నడచి, వీధిలోకి తొంగిచూశాడు. తరువాత పెద్దగా నిట్టూరుస్తూ యింటికి తిరగొచ్చాడు. యింట్లోంచీ కాళీ ప్లాస్టిక్ బిందెతో బయటికెళ్తున్న అమ్మాయి అతడికేసి చూడలేదు.

గోడమీది కాలెండరు వెనకున్న దీగుడు లోంచీ సీసా తీసుకుని మంచంపైన కూర్చున్నాడతను. అది పరపర లాడుతుండగా సీసామూత తీసి గడగడమంటూ దానిలోని ద్రవాన్నంతా తాగేశాడు. 'వుఫ్' మని వేడిగాలిని నోటిలోంచీ విడిచిపెడుతూ బీడీ వెలిగించుకున్నాడు.

"వాళ్ళింట్లో యీగలు మూగతా వుండేది వూరంతా తెలుసు. బయటికి మాత్రం పెద్ద బింకం ... యెవురేమారతారా అని యెగజూస్తా వుంటాడు. మద్దిస్తాలనీ, మీటంగులనీ అదనీ యిదనీ కమీషన్లు దండుకుంటాడు. పెద్ద పెద్దోళ్ళ యెనకమ్మటీ తిరిగేది! మిగిల్నోళ్ళ దగ్గర రౌడీ మామూల్లు వసూలుజేసేదీ... అంగిడోళ్ళ దగ్గిరా, టింబరు డిపోళ్ళ దగ్గిరా తెచ్చిందంటా అప్పే! అయినా తిరిగిచ్చేదుంటే గదా అప్పు? తెచ్చిచ్చిన కొయ్యట్టాంటిదైనా యెట్నోవొకట్ల వురువులు జేస్తా వుండానిని నన్ను యిడిసిపెట్టడు. మస్టరు సరింగా యీలేదని పనికిపోకబోతే అరస్తాడు. పైగా తప్పుడు కేసులు పెట్టి బెదిరిస్తాడు. అప్పటికి నాకేనా మనుషులు లేంది?"

వంటగదిలోంచీ గిన్నెలు పడుతున్న శబ్దం మాత్రమే వస్తోంది. నీళ్ళ బిందెతో పెరట్లోకెళ్తున్న అమ్మాయికేసి కోపంగా చూస్తూ "పొద్దన్నించీ నీళ్ళు దెచ్చేదేనా పని? యింగచాలు, గుడ్డలేమైనా వుతకాల్నేమోచూడు" అని విసుక్కున్నాడు పరమేశాచారి.

"పోలీసుల దగ్గిర్నించీ తప్పించుకోవాలంటే యింకో యిల్లే లేదంటా వుండాడు జూడు! క్రిష్ణారెడ్డోళ్ళు యింకో పనోడ్ని యింట్లోకి జేర్చరు తెలుసునా?..." కడుపులోకి చేరిన ద్రవం యిప్పుడిప్పుడే తలలోకెక్కుతున్నట్టుగా అనిపించడంతో పరమేశాచారి ముఖంలోకి కొంతకొంతగా వెలుతురు రాసాగింది. "వాళ్లింట్లో పనులు జేస్తావుండేటప్పుడు పగుల్లో యిల్లంతా నాకే అప్పగించి బయిటికి పొయ్యేటోళ్ళుగదా! యెక్కడిదుడ్డక్కడ్నే, యేడి నగలు ఆడ్నేపడున్నా యేమైనా కనబడకుండాపోయిన్నా? యిప్పటికి గూడా వాళ్ళెప్పుడైనా వేరే వూరికి పొయ్యేటప్పుడు రాత్రుల్లో కావిలిగా నన్ను పడుకోమని జెప్పిపోతారు. ఆ యింట్లో వుండే సోఫాలూ, తలుపులూ, కొయ్యసామగ్రంతా మనం జేసిందేగదా! రేత్రుల్లో పండుకునేటప్పుడు మనుషులకంటే బదులుగా అవే మనకు తోడుగా వుంటాయి...

వీధిలోంచీ మోటారుబైకు శబ్దం వినిపించగానే పరమేశాచారి వులిక్కిపడి పైకి లేచాడు. కాస్సేపలాగే నిలబడి ఆలోచించాక "పోలీసోళ్లు యింటిని కనిపెట్టి వచ్చినా వస్తారు. దానికంటే ముందుగా క్రిష్ణారెడ్డి సారును పట్టుకోవాల... నేను పోతా వుండాను" అని చెబుతూ ఆకుచెప్పులు తొడుక్కున్నాడు.

చుట్టూవున్న యిండ్లు ముందుకు చొచ్చుకురావడంతో మట్టిమిద్దె బయపడి వెనక్కుజరిగినట్టుగా కనబడుతోంది. గోడ పక్కనున్న సైకిలు స్టాండు లాగాడు

పరమేశాచారి. అరిటి తొక్కల్లాటైర్లు రెండూ తప్పచ్చిగా వున్న సైకిలును బలవంతంగా తోసుకుంటూ గొందిలోంచీ సందులోకొచ్చాడు. నీళ్ళ పంపుదగ్గర వరసగా పెట్టిన ప్లాస్టిక్ బిందెల పక్కన వెలిసిన చీరల ఆడవాళ్ల గుంపు గగ్గోలు చేస్తోంది. వాళ్ళకు పక్కనే సందులోనే కుంపటి ముట్టించి యిడ్లీలు చేస్తున్న ముసలావిడ అంగడిలో నేలపైన్నే గొంతుక్కూచున్న వ్యక్తులు కొందరు ఆవురావురుమంటూ తింటున్నారు. వాళ్ళకు మరికాస్త దూరంలో వో స్త్రీ సామాన్లు తోముకుంటోంది. ఆమెకెదురుగా మరో స్త్రీ అయిదేళ్ళ కుర్రాణ్ణి వీధిలో నిలబెట్టిస్నానం చేయిస్తోంది.

సందుమలుపులో రేకుల బంకు ముందు ఆగాడు పరమేశాచారి. గోడపక్కన నాలుగైదు పాతసైకిల్లున్నాయి. బంకులోపల రకరకాల టైర్లూ ట్యూబులూ కుప్పగా పడివున్నాయి. బంకు ముందు నేలపైన కూర్చుని అల్యూమినియం బేసినులోని నీళ్లలో ట్యూబును ముంచి పంచర్లు వెతుక్కుంటున్న గడ్డంసాయిబు పరమేశాచారిని పలకరించలేదు. కాస్సేపు అతడికేసి విసుగ్గా చూసిన తర్వాత "యీ రెండు టైర్లకూ పంచర్లేసిపెట్టు భాషా! గంటలో వస్తాను" అన్నాడు పరమేశాచారి.

"దీన్ని నాదగ్గిరికి తేవద్దని చెప్పలేదా నీకు?" భాషా ముఖం తిప్పకుండానే సమాధానం చెప్పాడు.

"నీకు షాపుండాది. నేను సైకిలుదెచ్చి పంచెర్లేయమన్నా... నీ దుడ్డునీకియ్యకపోతే అప్పుడడుగు. మిగిలిన సంగతులు నీకొద్దు..."

"యం ఆర్ పల్లి మునిరెడ్డిని తాగేసేమో అన్నావని కంప్లయింటిచ్చినాడంట! ఆ మనిసి సైకిల్ను తిరిగియ్యలేదని నాదగ్గిరికొచ్చి అడగతా వుండాడు... పోలీసుల చుట్టా తిరిగాల్సిన పనేముండాది నాకు?"

"దానికి సాక్షికం జూపించమను. అనావస్పంగా నామింద కంప్లయింటిస్తే నాకెందుకు బయిం? గంటలో వస్తాను. పంచర్లేసిపెట్టు ..." భాషా యేదో చెబుతున్నా వినిపించుకోకుండా సైకిలును గోడకానించి పెట్టేసి, ముందుకొచ్చేశాడు పరమేశాచారి.

వీధిలో కార్లూ, మోటారు బైకులూ, ఆటోలూ మనుషులను నడవనివ్వకుండా అటూ యిటూ పరిగెడుతున్నాయి. చిన్న బజారు వీధి పోలీస్టేషను ముందు పోలీసొకడు కనిపించగానే చటుక్కున పట్నూలు వీధిలోకి తిరిగేశాడు పరమేశాచారి. అక్కడి నుంచీ పెద్దరోడ్డులలోకి రాకుండా సందుగొందుల్లోంచీ నడుస్తూ కుమ్మర తోపును చేరుకున్నాడు.

నీళ్ళ పైపులు వేయడం కోసం మళ్లీ మళ్లీ తవ్విన రోడ్డు గుంతలు మిట్టలుగా వుంది. పైకి పొర్లుతున్న మురికి కాలువలు దుర్వాసనను వెదజల్లుతున్నాయి. వీధికి రెండువైపులా ముందుకు చొచ్చుకువచ్చిన యిండ్లభాగాలు అనారోగ్యంతో వాచిన శరీరాల్లా వికారంగా కనబడుతున్నాయి. వొక రేకులతలుపు యింటి ముందు ఆగి "దామూ ...దామూ ..." అని కేకేశాడు పరమేశాచారి.

యింట్లోంచీ "లేదు" అన్న సమాధానం మాత్రం వచ్చింది.

"నేనేరా ... నేనేమ్మా!" అంటూ తలుపును తోసుకుని లోపలికడుగేశాడతను. తలుపుకవతల మిద్దెమెట్లకిందున్న బాత్రూంలోంచీ సన్నటి ఆకారమొకటి బయటికొచ్చింది.

"యింత అదురుగుండెలుంటే యెట్ల నెగ్గుకొస్తార్రా మీరు" అని కోపంగా అరిచాడు పరమేశాచారి.

తడిపాదాలు నేలపైన ముద్రల్ని వదలిపెడుతుండగా ముందుకొచ్చిన దామూ "మెల్లింగా మాట్లాడన్నా! యిప్పటికే పోలీసులు రెండుతూర్లు వచ్చిపోయినారు. ఆ పక్కవీధిలోనే కాపుగాసుకోనుండారేమో అని యింట్లోనే ముడుక్కోనుండాను ..." అన్నాడు.

"అయినా ఆ మనిసితో లాలూచీకి దిగి నేనురాకపోయినా పనిలోకి దిగతామని చెప్పినారంట గదా! యింక పోలీసులెందుకొస్తార్లే మీ దగ్గరికి?" అంటూ పరమేశాచారి హాల్లో తడిగా వున్న నేలపై గొంతుక్కూచున్నాడు. దాదాపు పదడుగుల పొడవూ వెడల్పులున్న ఆ పాత మిద్దింటిలోపల గూడులాగున్న వంటగదిలోంచీ "టీ దాగతావాన్నా?" అని అడిగిందొక స్త్రీ.

"అది గూడా చెప్పాల్నా! బిన్నాగా కాంచు" అని కసిరాడు దామూ. పరమేశాచారి బీడీ వెలిగించుకుంటూ ..." "మూడు దినాలుగా క్రిష్ణారెడ్డిసారు సెల్లులో దొరకలేదు... లేకపోతేనా? . . ." అని హుంకరించాడు.

"ఆయిన దొరికే లోపల వీళ్ళు మనల్ని బొక్కలోకి తోసేసి కుమ్మి పారేస్తారు. రెండుమూడుతూర్లు వాళ్ళ యెదాన పడినాంక గూడా నువ్వు మారకపోతే యెట్లన్నా! యెవురింట్లోనో పడుండే పరుపుల్ని యేదోవొకరకంగా ముగించేసి పోతే సరిపోదా? ఆ మనిషి సరిగ్గా కూలీలు యీడు. నువ్వేమో పనులంతా మట్టసంగానే జరగాలంటావు. మధ్యలో మమ్మల్ని మీరిద్దరూ గుంటికీ మిట్టకూ యీడస్తావుండారు." దామూ భయంతో గొంతు తగ్గించుకుని మాట్లాడసాగాడు.

"మనమేమన్నా అడవిలో వుండామారా దామూ! యెందకట్ల బయపడతావు?" అని కసిరాడు పరమేశాచారి. "యిదేవూర్లో పదేండ్లుగా పనులు జేస్తావుండాను. గృహప్రవేశాలప్పుడు అన్ని యిండ్లోళ్ళూ ప్రియంగా కొత్త గుడ్డలు పెట్టి అంపించినారేగదా! యింతకాలానికి యీ మనిషి నా మీద నిందేసి పోలీస్టేషనెక్కించినాడు. యిన్నేండ్లుగా పనులిస్తావుండాననే యింగితంలేకుండా మీరేమో ఆ మనిషి కాళ్ళమింద పడి నన్ను తొలగదోసుకోని పోతావుండారు. మీ సంగతి జూస్తే ఆ పొద్దు మందుమీంద మన రాజిగాడూ, మనిగాడూ వాళ్ళింట్లో యేందో అడగానువని చేసినట్టే అనిపిస్తా వుండాదినాకు..."

"చేతి పనులు చేసేటోళ్లు వొళ్ళలిసినప్పుడు రెండు దరాములేసుకునే దాంట్లో కొత్తేముండాదన్నా! అయినా యెంత నిషాయెక్కినా మనోళ్ళు వొళ్ళుదెలవకుండా పనులుచేసేటోళ్ళు మాత్రం కాదు ..."

దామూ భార్య తీసుకొచ్చిన టీ ని చప్పరిస్తూ "అట్లయితే ఆ మనిషితో యెందుకు వొప్పుకోవాల్ల? అట్లాంటోనికి బయిపడి వూరికే పనులెందుకు చెయ్యాల?" అని మండిపడ్డాడు పరమేశాచారి.

"వారం దినాలుగా పనికిపోకుండా దాంకోని తిరగతా వుండాము. నా పెండ్లాం కమ్మలు కుదవపెట్టిన దుడ్డుతో యీవారం దినాలూ లాగినాను. యింక పనిలోకి పోకపోతే

జరగదు. వచ్చి పనిలోకి దిగితే కేసు యెత్తేసానని ఆ మనిషి చెప్పంపించినాడు. నీకయితే పెద్ద పెద్దోళ్ళ సహాయం వుండాది. నీ మాదిరి గీత గీసుకొని బతకలేను. భుజంపైన నవకమేసుకోని, వులీ రంపం పట్టుకోని యీ వూరికొచ్చినోణ్ణి. యిట్లాంటి అగాయిత్యం ఆసాములు దొరికినప్పుడు వుపాయంగా పని ముగించుకోవాల్ల. టింబరు డిపోల్లో, హార్డువేరు అంగళ్ళల్లో కొంచెం చానాగా కమీషను తీసుకుంటేనే మనకు గిట్టితింది ..." దామూ గూడా టీ తాగుతూ చెప్పుకుపోయాడు.

"ఆ మాత్రం వుపాయం నాకు లేకపోలేదు పోరా! మనకు న్యాయంగా యెంత కమీషను రావాల్నో దాంట్లో పైసా తగ్గితే నేనొప్పుకోను" అన్నాడు పరమేశాచారి.

"మనం న్యాయంగా రావల్సిన దుడ్డే తీసుకుంటా వుండామని యే ఆసామైనా వొప్పుకుంటే నాకు జూపించు. అన్నిట్లో వాళ్ళకు తెలవకుండా మంతమైన కమీషను నొక్కేస్తా వుండామని మనల్ని దొంగల్ని జూసినట్టే చూస్తావుండారు" అంటూ దామూ అడ్డుతగిలాడు.

"అట్లనిజెప్పి పనులు గాకుండానే కూలీ దుడ్డంతా రాబట్టుకునే ఆచార్లేమైనా మిద్దెలూ, మేడలూ గట్టినారేమో చూపించరా నాకు!" అని నిలదీశాడు పరమేశాచారి. "యింతకాలం కష్టపడి సంపాయించిన పేరంతా వొకదినంతో పోగొట్టుకుంటామా జెప్పు? మా కనగానిపల్లెలో రైతులు యిప్పుటికి గూడా వాళ్ళిండ్లలో వుండే బిసపలకలూ, బెంచీలు చూసినప్పుడంతా మాతాతనూ, నాయన్నూ గెవనం జేసుకుంటారు దెలుసునా?..."

"మనం అంత నికార్సుగా బతికేద్చేటట్టుంటే సైకిలుషాపు మునిరెడ్డితో యెందుకు పెట్టుకున్నావన్నా?" దామూ గొంతు కరకుగా పలికింది.

"వాని దగ్గిర అయిదారేండ్లుగా సైకిల్ను బాడిగకు తీసుకుంటానే వుండాను గదరా! రేత్రి బాడిగలకింద నేను గట్టిన దుడ్డుతోనే వాడు రెండు కొత్త సైకిళ్ళు బేరం జేసుకోనుండచ్చు యేందో పనుల్లోబడి వొకతూరి పద్దైద్దినాలు యింట్లో పెట్టుకుంటే దానికి మున్నూరు గట్టమంటాడా వాడు? ఆ పొద్దు తిక్కరేగి మందుమింద యింటికి పోతావున్నాన్లే! వాడు దార్లో పట్టుకున్నాడు. కోపమొచ్చి యీడ్చి రెండు దెబ్బలేసినానా? వాడు పెద్ద పులావరు మాదిరి పోలీసులకు జెప్పినాడు. అయినా అది వాని సైకిలని జెప్పే సాక్షిక మేముండాది? దాని మిందుండే వాళ్ళ నెంబర్ను యెప్పుడో గోకి పారేసినాను ..." పరమేశాచారి గుంభనగా నవ్వసాగాడు.

"అదేన్నా నేను గూడా జెప్పేది! మనకు మంచి పేరెట్లా రాదు ... బతికేదైనా తెలుసుకోవాల్ల గదా! ..." దామూ నిట్టూర్చాడు.

"పేరు సంగతి పక్కన బెట్టురా దామూ!" పరమేశాచారి పైకిలేచి పంచవెనక అంటుకున్న దుమ్మును దులుపుకోసాగాడు. "మనం చెక్కే తలుపులూ, దాల బందరాలనూ జూడు. పాణంలేని కొయ్యల్ని దెచ్చి జోడిస్తే అవి మల్లంక యెంత పాణంతో మిసమిసలాడతాయో జూసినావా? యెవురికోసరమో చేస్తావుండా మనుకోని అడ్డదిడ్డంగా చేస్తే అవి వూనాపం బిడ్డలమాదిర్రై నోరు గొట్టుకోవా? యెవుడి మిందనో కోపం బెట్టుకొని రోగిష్టి బిడ్డల్నికంటారా యెవ్వరైనా? ఆ పాపమంతా మనకే జుట్టుకుంటాది తెలుసునా?..."

దామూ అతడికేసి కళ్ళార్పకుండా చూస్తూ "అవి మనకు కన్న బిడ్డలమాదిరే అయితే అవిటికీ మనకూ సంబంధమే వుండకుండా పోతిందాన్నా? అసలా పొద్దు మందుమింద కండ్లు తిరిగి మనం జేస్తావుండే సోఫాలో కూచున్నాననే గదా ఆయింటోళ్ళు అంత ఆగడం జేసినారు?" అని అడిగాడు.

పరమేశాచారి అతడి మాటల్ని పట్టించుకోకుండా "మీరందరూ నన్ను దిగ్గాలికేసి గట్టుపైన పడేది జూసుకున్నాల్లేరా? అప్పటికి నాకేనా జరుగుబాటుండేది? మూడునెల్లుగా బాడిగ గట్టలేదని యింటి గల్లోడు చుట్లా తిరగతా వుండాడు. యిస్కూల్లో ఫీజుగట్టలేదని పేరు దీసేసినారని పిల్లోడు నెలగా యింట్లోనే వుండాడు. అయినా నేను మీ మాదిరిగా చేతులెత్తేసే మనిసిగాదు. నేను మంచికి మంచి, చెడ్డకు చెడ్డ..." అని మాట్లాడుతూనే వీధిలో కొచ్చేశాడు. కుమ్మరతోపు వెనక సందులోంచీ పోలీసు క్వార్టర్సు వైపుకు నడచాడు. తలపైకి భయంభయంగా సవకంలాక్కుని బాలాజీ కాలనీ మీదుగా ప్రకాశం రోడ్డులోకొచ్చాడు. రోడ్డు పక్కన ఆటో గేరేజీ పక్కన దాక్కున్నాడు. దూరంగా ఆరు సీట్ల ఆటో కనిపించాక రోడ్డు పైకొచ్చి దాని కడ్డంగా నిలబడ్డాడు. అప్పటికే పదిహేను మందిని యిరికించుకున్న ఆటోలోకి దూరి "విద్యానగర్" అని అరిచాడు. విద్యానగర్ వచ్చేవరకూ ఆటో లోపల మనుషుల మధ్య ముడుక్కున్నాడు. ఆటో డ్రైవర్‌కు నాలుగు రూపాయలిచ్చేశాక విద్యానగర్ దగ్గర దిగి, కాలనీలోకి పరుగులాంటి నడకను సాగించాడు.

కాలనీలో పెద్ద పెద్ద ప్రహరీ గోడల కవతల, పచ్చని చెట్ల నీడలో భవనాలు మత్తుగా తూగుతున్నాయి. యింకా ఆఫీసులూ, కాలేజీలూ వదలిపెట్టక పోవడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా వున్నాయి. కాస్సేపటి తర్వాత పక్కవీధిలోకి మలుపు తిరిగిన పరమేశాచారి దూరంగా వో యింటి ముందు లారీ నిలబడి వుండడం కనిపించగానే వులిక్కిపడ్డాడు. యెదురింటిలోంచీ యిద్దరు కూలీలు పెద్దమూటను బయటికి తేవడం చూడగానే ముందుకు పరిగెత్తాడు.

వీధిలో మునిసిపాలిటీవాళ్ళ కమ్ములచట్రాల్లోపల కానగ చెట్లు యేపుగా పెరుగుతున్నాయి. కొండరాళ్ళను తొలిచి గట్టిన ప్రహరీ గోడ బలంగా వుంది. దాని కోట తలుపుల్లాంటి యినప నగిషీల తలుపుల కవతల విశాలమైన ఖాళీ స్థలంలో మూడంతస్థుల యిల్లు ధీమాగా నిలబడివుంది.

కంగారు పడుతూ ప్రహరీ లోపలికెళ్ళి, పచ్చిక మధ్యలో వరసగా పరిచిన నాపరాళ్ళ బాటలో యింటివైపుకు వురికాడు పరమేశాచారి. యిద్దరు మనుషులు ఆరడుగుల పొడవున్న రోజువుడ్ అలమరాను పైకెత్తుకుని యింటిలోంచీ బయటికొచ్చారు.

"యేడికి? యేడికి?" కంఠం వణుకుతుండగా ఆదుర్దాగా అడిగాడు పరమేశాచారి.

అలమరా బరువుకింద ఆపసోపాలు పడుతున్న వాళ్ళిద్దరూ అతడివైపుకు తలతిప్పలేక పోయారు. హాలులోకి అడుగుపెట్టగానే పరమేశాచారి మరింతగా హడలిపోయారు.

పెళ్ళిమండపమంత పెద్దదిగా వున్న డూప్లెక్స్ హాలులోపల సామాన్లన్నీ చిందవందరగా వున్నాయి. పెద్ద అట్ట పెట్టెల నిండా యేవేవో సామాన్లు కుప్పగా పడివున్నాయి., డైనింగ్ టేబులుపైన దాని కుర్చీలన్నీ సర్దుకుని వున్నాయి. హాలుకు మధ్యలో వుండాల్సిన

సోఫాలు రెండూ వాటి మిగిలిన కుర్చీలతో బాటూ వో మూలలో యిరుక్కున్నట్టుగా వున్నాయి. వీటి పక్కన అద్దం బిగించిన తామర పువ్వు ఆకారపు టీపాయ్ దీనంగా చూస్తోంది. డూప్లెక్సు హాలు మేడపైన రోజువుడ్ బీరువా ముందు కూర్చున్న నడివయస్సు స్త్రీ పెద్ద సూట్‌కేసులోకి బట్టలు సర్దుతోంది.

మేడ మెట్లెక్కి గసబోసుకుంటూ "యిల్లు మారస్తావుండారాక్కా?" అని అడిగాడు పరమేశాచారి.

చుట్టూ పరుచుకున్న పట్టుచీరల మధ్య పెద్ద పెద్ద గోళాలతో తయారు చేసినట్టున్న ఆకారం తలపైకెత్తింది. గుండ్రటి ముఖంలోని నోరు మరింత గుండ్రంగా తెరుచుకుంటూ వుండగా ఆమె వుత్సాహంగా "హైదరాబాదు" అంది.

"సారుకు ట్రాన్స్ఫరాక్కా" యేడుపు ముంచుకొస్తూండగా అడిగాడతను.

"ప్రమోషను. రీజనలాఫీసుకు ..." అందామె తన్మయంగా.

"యిల్లు బాడిగకిచ్చేస్తా వుండారా?"

"కాదు ... అమ్మేసినాం ... అక్కడ జూబ్లీ హిల్స్‌లో మంచియిల్లు తక్కువరేటుకు దొరికింది. అంతా గౌతమరెడ్డన్నే జూసుకుంటా వుండాడు.".

"అట్ల జెప్పండి. నేను చెన్నయిలో వాళ్ళింటిపని జేస్తావుండేటప్పుడు ఆ అక్క అంటావునింది. మన సారుకు తొందర్లోనే ప్రమోషను గ్యారంటీ అనింది." అతడి గొంతులో ఏడుపు జీర బలంగా ముంచుకొస్తుంది.

మా కొడుకు అక్కడ్నే కాంట్రాక్టులు జేసుకుంటా వుండాడు. మా అల్లుడుగూడా అక్కడ్నే వుద్యోగం ..." వరదనీళ్ళు పడ్డప్పుడు తత్తళించే చెరువులా ఆమె ముఖం వుద్వేగంతో యెగసిపడుతోంది.

"తలుపులు దాలబంధరాలూ అంతా బలార్షా టేకుతో జేసినాము. షోకేసు రోజువుడ్డు... యింట్లో వుండే కబ్బోర్డులూ,అలమారాలూ అన్నీ రోజువుడ్డే ... బంగారట్లాయిల్లు. బాడిగకిచ్చుంటే మళ్ళాయెప్పుడైనా మనూరికి వచ్చేసుండచ్చుగదక్కా! యెందుకమ్మేసినారు?" తుఫానులో పంటనంతా పోగొట్టుకున్న వ్యక్తిలా పరమేశాచారి బాధపడసాగాడు.

"బాడిగ కిచ్చి వాళ్ళు యిల్లును సరిగ్గా పెట్టుకోలేదని అంగలార్చేదెందుకు? పైగా అక్కడ యిల్లు కొనుక్కునేదానికి దుడ్డు కూడా కావద్దా!" రంగురంగుల పట్టుచీరలను సూట్‌కేసులో సర్దుతూ ఆమె పెదవులు చప్పరించింది.

"సోఫాలూ, డైనింగ్‌టేబులూ, టీపాయిలూ భద్రంగా లారీకెక్కించమని చెప్పినావాక్కా! లేకపోతే వాటికి దెబ్బలు తగిలేను ..."

"ప్చ్ ..." ఆవిడ మరోసారి పెద్దగా పెదవులు చప్పరించింది. "వాటిని యిక్కడ్నే అమ్మేసినాము. యిప్పటికే మూడు లారీల సామానయ్యింది. యీ మాదిరి ఘనంగా వుండే ఖర్చీదర్లు ఆ వూరోళ్ళు చూస్తే నవ్వుకుంటారు. దుడ్డుంటే హైద్రాబాదులో దొరకని ఖర్చీదరా?"

"యెవురికి ... యెవురికమ్మేసినారు?" పరమేశాచారికి గొంతు పెగల్లేదు. ఆవిడ తదేక ధ్యానతో చీరలు సర్దుకోసాగింది. అతను మెట్లుదిగి కింది హాల్లోకి వచ్చాడు.

ముఖద్వారం దగ్గరి తలుపులనోసారి తడిమి చూశాడు. కిటికీ తలుపులనంతా పలకరిస్తున్నట్టుగా యిల్లంతా తిరిగాడు. మూలకు చిమ్మిన చెత్త మధ్యలో గుంపుగా జరిగిన సోఫాలనంతా తాకి పలకరించబోయాడు. లోపలి గదుల్లోని కబ్బోర్డులనూ, టీపాయ్‌లనూ బిక్కమొగమేసుకుని చూశాడు. కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుండగా మళ్ళీ డూప్లెక్స్ హాలు మెట్లెక్కి "రెడీమేడు ఫర్నీచరింత మన్నికగా వుండదక్కా! మనకోసరమని అక్కరగా జేసిన వురువులు. పనికిరానోళ్ళ చేతిలో పడితే అవిటికి విలువేముంటాది జెప్పు?" అని అడిగాడు.

ఆవిడ సమాధానం చెప్పలేదు.

పరమేశాచారి ఆ మెట్టుపైనే మానులా నిలబడిపోయాడు. మెట్లపక్కన అందంగా బిగించిన చట్రాల్లోని అద్దాల గుండా యింటిలోపలి పాలరాతి నేలపైకి పడుతున్న సాయంకాలపు యెండ లేత బంగారంలా ప్రతిఫలిస్తోంది. కింద హాల్లోంచీ కూలీలిద్దరు మరో పెద్ద అట్టపెట్టెను బయటికి మోసుకెళ్తున్నారు.

"అక్కా!" గొంతు పూడుకుపోయి మాటలు స్పష్టంగా పెగలకపోవడంతో పరమేశాచారి మరోసారి "అక్కా!" పెద్దగా పిలిచాడు. ఆమె చీరల మడతలలోంచీ తలపైకెత్తకుండానే యేమిటన్నట్టుగా తలవూపింది.

"అన్న సెల్లుకు మూడుదినాలుగా ఫోనుజేస్తా వుండాను యెంగేజీ వస్తావుండాది. యెప్పుడొస్తాడు?"

ఆవిడ రసగుండ్లనూ, చందనం కవర్లనూ సూటుకేసులో సర్దుతూ "యేమో! హైద్రాబాదుకు పొయ్యా పోకముందరే పనెక్కవయ్యిందట. సామాన్లు లారీ కెక్కించుకుని రమ్మని బాంకీ ప్యూన్నే అంపించినారు" అంది.

"అర్జెంటుగా మాట్లాడాలక్కా! పోలీసోళ్ళతో వొకమాట చెప్పి నన్నిడిసి పెట్టమని చెప్పాల ..."

"మళ్ళా పోలీసోళ్ళా?" ఆవిడ కోపంగా వురిమి చూసింది. "నెలకొక తూరైనా స్టేషనుకు పోకపోతే తిండి దిగదా నీకు? పోయిన తడవ నీకు బెయిలు దీసిచ్చేదానికి యెన్నితూర్లు తిరగాల్సొచ్చిందో అప్పుడే మర్చిపోయినావా?"

"ఆ జగన్నాథంనాయుడి యింటిపనికి వొప్పుకున్నాంకేగదక్కా నాకీ అగసాట్లు?" పరమేశాచారి చేతులు నలుపుకుంటూ, యెండుకుపోతున్న పెదవుల్ని నాలుకతో తడుపుకోసాగాడు. "వారం వారం కూలీల మస్టరియ్యకుండా ఆ మనిషి నన్ను పనులు మాత్రం సక్రమంగా జేసేదిలేదని రంపుజేస్తావుండాడు. కూలీ దుడ్డీకపోతే నాదగ్గిరుండే ఆచార్లు గొమ్మునుంటారాక్కా! మేము పనికిపోకపోతే పోలీసు రిపోర్టిస్తావుండాడు. వూళ్లో అంత పలుకు బడుండే మనిషిని మేము కాతరు జెయ్యలేరని కడుపులో మంట బెట్టుకుంటా వుండాడు ..."

ఆమె వోసారి అతణ్ణి వురిమిచూసి మళ్ళీ తన పనిలో తాను తలదూర్చుకుంది.

రెండు నిమిషాలు తటపటాయించాక "నేను మన రెడ్ల యిండ్లలో పన్లయితే సరింగా చేస్తానని వాళ్ళకు కోపమక్కా... మొదుట్నించీ నన్ను వాళ్ళ పార్టీగాదని

దబాయిస్తానేవుండాడు...” అన్నాడతను. ఆవిడ ముఖంలో కొంత ప్రసన్నత కనిపించగానే “తాగేసిపోయి వాళ్ళింట్లో రంపుజేసినానని నాపైన కేసుబెట్టినాడు. యిన్ని దినాలుగా మనింటికి వస్తా వుండాను. నేను మందు దాగిందెప్పుడైనా జూసినావాక్కా?” బోలీసోళ్ళ బయిం పెట్టకపోతే నేను సరింగా పనులు జెయ్యనంట ...” అంటూ మరేదో చెప్పబోయాడు. ఆవిడ పైకి లేచి పక్కగదిలోకి వెళ్ళిపోయింది.

పరమేశాచారి నీరసంగా మెట్లు దిగి కిందిహాల్లో కొచ్చాడు. సోఫాలూ, కుర్చీలూ, టీపాయ్‌లూ, దివాన్‌లు మాత్రం మిగిలిన హాలు ఆదివారంనాటి కోర్టుహాలులూ బోసిపోయివుంది. లోపలున్న షెల్ఫులూ, బొమ్మలూ తరలిపోవడంతో షోకేసు ముసలి లాయరు పళ్ళూడిపోయిన నోరులా వికారంగా వుంది.

సూట్‌కేసును నెత్తిపైకెత్తుకుంటున్న కూలీతో కృష్ణారెడ్డి భార్య “అన్నీ పట్టుచీరలు... కాబిన్ లోపల పెట్టుకోండి... యేమన్నా అయితే సారు గొమ్ముగుండడు. వొళ్ళు దగ్గిరబెట్టుకోని భద్రంగా అక్కడికి జేర్పించాల ... సరేనా?” అని జరగని పొరబాటుకు పెద్దగా మందలిస్తూ మెట్లుదిగసాగింది. హాల్లోకి వచ్చాక వంటగదిలో సామాన్లు సర్దుతున్న వ్యక్తులకు జాగ్రత్తలు చెప్పసాగింది.

పరమేశాచారి జంకుతూ పొడిదగ్గు దగ్గి “అయితే నువ్వుగూడా యిప్పుడే యెలబారిపోతావాక్కా!” అని అడిగాడు.

“నారాయణాద్రికి యింక గంటే టయిముండాది. ఆలోపల సామాన్లంతా లారీ కెక్కించమంటే యీ కూలోళ్ళు పొద్దున్నుంచీ టాలాటోత జేస్తావుండారు ...” అందామె విసుగ్గా.

“అయితే రాత్రి నించీ మనింట్లో యెవురైనా కాపలాగా పండుకోవద్దాక్కా! నేనుండేదా?” అని అడిగాడు పరమేశాచారి వినయంగా యేడుపు గొంతుకతో.

ఆవిడ వంటింటిలోంచీ పడకగదిలోకి సరసరా నడుస్తూ “ఖాళీ యింటికి కావిలెందుకు? యిల్లును బేరం జేసిన మనిషి యిప్పుడొస్తాడు. వాని ముగాన బీగాలు పారేసిరమ్మని సారు ఫోను జేసినాడు” అందామె.

“ఫోనా?... ఫోను ...” అని గొణుక్కుంటూ ద్వారబంధం దాటి బయటికొచ్చిన పరమేశాచారి ప్రహరీగోడ పక్కనున్న కుక్కగూడు ఖాళీగా కనిపించడంతో వులిక్కిపడ్డాడు. ఆతురతతో మళ్లీ యింటిలో కొచ్చి “జూలీని గూడా హైద్రాబాదు కంపించేసినారాక్కా!” అని అడిగాడు.

ఆవిడ గసలుబోసుకుంటూ “ఇంగా యేడజూలీ! అది జచ్చిపొయ్యి నాలుగైదు దినాలైపొయ్యింది” అంది.

“అయ్యయ్యో! అయ్యయ్యో!” పరమేశాచారి పెద్దగా ఆక్రోశించాడు. “బంగారట్టా కుక్కగదక్కా! నేనింట్లో వుండేంతసేపూ నా కాళ్లెనకాలే తిరగతావునింది”.

“నెలగా దానికి వొకటే జరమూ, బేదులూ ... అప్పటికీ పనోడి దగ్గిరికిచ్చి వెటర్నరీ ఆస్పత్రికి గూడా అంపించినాను. వారం దినాలు కొట్టకలాడింది. యేంజేద్దాం చెప్పు ఆచారీ! అది హైద్రాబాదుకొచ్చేదానికి అడిగిరాలేదు” చెబుతూనే ఆవిడ మళ్లీ మెట్లెక్కి వెళ్లిపోయింది.

నేలలోకి వేళ్ళు దిగిపోయిన చెట్టులా పరమేశాచారి అక్కడే కాసేపు నిలబడిపోయాడు. తరువాత నీళ్ళు నిండిన కళ్ళతో కుక్క గూడు దగ్గరికి నడిచాడు. గూడులోపలినుంచీ యేవో రెండు కళ్ళు తనకేసి దీనంగా చూస్తున్నట్టు అనిపించగానే అతను నిలువెల్లా వణికిపోయాడు. కిటికీలోంచీ అటువైపుకు తిరిగిన సోఫాలూ, కుర్చీలూ తనకేసి పెడముఖం పెట్టినట్టుగా కనిపించసాగాయతడికి. ఖాళీ చేస్తున్న యింటిలోంచీ బయటపడిన చెత్తా చెదారం, కాగితం ముక్కలూ తనకేదో చెప్పడానికి ప్రయత్నిస్తున్నట్టుగా అనిపించసాగింది.

"వస్తా జూలీ!... పోతా జూలీ... చెప్పకుండానే యెలబారిపోయినావే నువ్వు!... ఎంత పనిజేస్తివే నువ్వు! ... " గొణుక్కుంటూ, మళ్లీ మళ్లీ వెనుదిరిగి చూస్తూ పరమేశాచారి నడవసాగాడు.

లారీ కాబిన్‌లో బీడీ గాల్చుకుంటూ కూర్చున్న డ్రైవరు క్లీనరునెందుకో బూతులు తిడుతున్నాడు. చలికాలపు యెండ సాయంత్రానికి చల్లబడిపోతోంది. ట్రంకురోడ్డు పైకొచ్చాక వో చెట్టు వెనక దాక్కున్నాడు పరమేశాచారి. దూరంగా ఆరుసీట్ల ఆటో కనిపించాక రోడ్డు పైకొచ్చాడు. ఆటోలో కూర్చున్నాక కాలనీ వైపుకు వెనుదిరిగి చూడడానికి ప్రయత్నించాడు. క్రిక్కిరిసిన తలలమధ్య కాలనీ రోడ్డుగూడా చిన్న తోకచుక్కలాగే కనిపించింది. నాలుగురోడ్ల కూడళ్ళలో ఆటో ఆగినప్పుడల్లా బయటున్న పోలీసు చూపులు తనకోసం గాలిస్తున్నట్లు అనిపించడంతో బల్లిపిల్లలా ఆటోరేకులకు అతుక్కుపోసాగాడు. బాలాజీ కాలనీ దాటాక ఆటోను ఆపమని గొడవచేసి, "యెక్కడంటే అక్కడ నిలిపితే ట్రాపిక్కోళ్ళు ఫైన్లేస్తారు" అని మండిపడుతున్న ఆటోడ్రైవరు చేతిలో నాలుగురూపాయలు విసిరేసి, కిందికి వూడిపడ్డాడు. సవకాన్ని తలపైకి లాక్కున్నాక యల్టెసీ కాలనీలోకి నడచాడు. పాత జ్యోతీ తియేటరు మీదుగా అలిపిరి రోడ్డులో కొచ్చి పట్నాలు వీధిలోకి తిరగబోయాడు. అంతలో ఆ ప్రయత్నం మానుకుని అలిపిరికేసి తిరిగాడు. స్విమ్స్ దగ్గరికొచ్చాక వో క్షణం ఆగి, ఆ తరువాత పడమటికి తిరిగి స్విమ్స్ హాస్పిటల్ రోడ్డులో నడవసాగాడు.

పశ్చిమాన్నుంచీ పడుతున్న యెండ పాలిపోయి నీడలు వ్యాపిస్తున్నాయి. రోడ్డులో నడుస్తున్న వ్యక్తులు నిస్సారంగా వున్నారు. స్విమ్స్ హాస్పిటల్ ముందుకొచ్చి సిమెంటు చప్టాపైన రోగులకోసం వచ్చిన వ్యక్తుల మధ్యలో కూర్చున్నాడు పరమేశాచారి.

ఆస్పత్రి చుట్టూ దీనంగా తిరుగుతున్న మనుషుల్ని చూస్తుంటే అతడికెందుకో వూరట కలుగుతున్నట్టుగా తోచింది. చూస్తుండగానే చుట్టూ కరెంటు దీపాలు వెలిగాయి. చీకటి త్వరత్వరగా ముదరసాగింది. పక్కన కూర్చున్న వ్యక్తులు గూడా నీడల్లా కనబడసాగారు. ఆస్పత్రిలోంచీ స్ట్రెచర్‌పైన వచ్చిన శవాన్ని యేడుస్తున్న వ్యక్తులు వానులోకి యెక్కిస్తున్నారు. వాళ్ళను పట్టించుకోకుండా యిద్దరు కుర్ర డాక్టర్లు పక్కనుంచే నవ్వుతూ వెళ్ళిపోతున్నారు.

క్రమంగా ఆస్పత్రి ముందు కూర్చున్న జనం పలచబడి పోసాగారు. పక్కన కూర్చున్న వ్యక్తులు అక్కడే కారియర్లు విప్పి అన్నాలు తిని, అక్కడే నడుములు చేరేసి నిద్రపోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఆకలిగా అనిపించగానే కాంటీనుకెళ్ళి అయిదురూపాయలిచ్చి వొక

బన్నూ, వొక టీ కొనుక్కున్నాడు పరమేశాచారి. టీలో రొట్టెను ముంచుకుని తింటూ, గోడ గడియారాన్ని చూసి "నారాయణాద్రి కావలి జేరి పొయ్యుంటాది ..." అని గొణుక్కున్నాడు. చీకటిలో నీడలా నడుస్తూ అలిపిరి రోడ్డు మీదుగా పాతగోషా ఆస్పత్రిదాకా వచ్చి, తర్వాత అనంత వీధిలోకి మర్లాడు. వీధి నిర్మానుష్యంగా వుంది. యిండ్లలోంచీ టీవీల మ్రోత మాత్రమే వినబడుతోంది. సందులోంచీ తిరిగి, గొందిలోకొచ్చా మట్టిమిద్దెను చేరుకున్నాడతను. మూసుకున్న యింటి తలుపు చెదలు పగుళ్ళలోంచీ చీకటి తెరలా గుడ్డి దీపపు వెలుతురు కనబడుతోంది.

తలుపును నెమ్మదిగా తోసుకుని యింటిలోపలికొచ్చారు పరమేశాచారి. కుర్రాడూ అమ్మాయీ గోడపక్కన చాపపైన పడుకుని నిద్రపోతున్నారు. భార్య మాత్రం టీవీలో అతుక్కుపోయి వంకర్లు పోతున్న కార్యక్రమాన్ని కళ్ళుచించుకుని చూస్తోంది.

"యెవురైనా వచ్చిపోయినారా?" అని వీలయినంత తాపీగా అడగడానికి ప్రయత్నించాడతను.

"యిద్దురు ...పోలీసులు" అందామె వుదాసీనంగా.

"అన్నం తిన్నారా?" అని ప్రశ్నించాడతను. ఆవిడ సమాధానం చెప్పలేదు.

పరమేశాచారి వంటగదిలోంచీ రెండు పాత గోనెసంచులు తీసి "సామాన్లు చిన్నాగా సర్దేద్దాం" అన్నాడు. ఆవిడ తెల్లబోయి చూసింది.

"రాత్రి రెండుగంటలకు గుంతకల్లు పాసింజెరు... కదిరికి... మీ అన్న అక్కడ పన్లు చానా వుండాయనీ, ఆ చార్లు సరింగా దొరికేది లేదనీ అంటానేవుండాడు..."

ఆమె నిర్లిప్తంగా పైకిలేచి పాత్ర సామాగ్రినంతా గోతాల్లోకి చేరవేయసాగింది. రెండుగోతాలు నిండే సరికి వంటగది ఖాళీ అయిపోయింది. నిద్రపోతున్న అమ్మాయిని పైకి లేపి దానినెత్తిపైన ట్రంకుపెట్టెలూ, చాపలూ, దిండ్లూ పెట్టిందామె. కళ్ళు నలుముకుంటూ పైకిలేచిన కుర్రాడితో "టీవీ యెత్తుకోరా" అని గద్దించాడు పరమేశాచారి. యింటికి తాళం వేశాక, తాళం చెవిని పక్కింటి తలుపుల సందులోంచీ లోపలికి గిరవాటేశాడు. మడిచిన యినపమంచంపైన మూటను పెట్టి రెండింటినీ తలపైకెత్తుకున్నాడు. మరో మూటను పైకెత్తుకున్నాక కుర్రాడితో "స్టూలు గూడా యెత్తుకో!" అంది అతడి భార్య.

పరమేశాచారి విసుగ్గా తలతిప్పి "వద్దులే! యిప్పటికే టీవీ బరువుగా వుండాది. అది పాతదైపొయ్యింది. పొయ్యిలోకి మాత్రమే పనికొస్తుంది" అని కసురుకున్నాడు.

"పద్దైదేండ్లుగా యింట్లోనే వుండాది. వుండేదొకే స్టూలు... యెత్తుకోనాయినా!" అందామె కోపం ముంచుకొస్తూండగా.

తిరగేసిన స్టూలు మధ్యలో టీవీని అమర్చి, రెండింటినీ తలపైకెత్తుకున్నాడా కుర్రాడు.

నిద్రకుపక్రమిస్తున్న యిండ్ల మధ్యలోంచీ, చీకటిలోనే దాక్కుని నడుస్తూ, తన వెనక ముగ్గురు అనుసరించి వస్తున్నారన్న విషయాన్ని మరచిపోయినట్టుగా వేగంగా నడవసాగాడు పరమేశాచారి. తీర్థకట్టవీధిలో అంగళ్ళు అప్పుడే మూస్తున్నారు. గాంధీ రోడ్డులోని వాహనాలు వన్‌వే ట్రాఫిక్ రూలు తొలగినవేళ గావడంతో రెండువైపులకూ పరిగెడు

తున్నాయి. మ్యూజియం పక్క సందులో పగటి పాత గుడ్డల అంగళ్ళు ఖాళీ చేసిన స్థలంలో రాళ్ళూ, గోడలపైన చీలలూ మాత్రమే కనిపిస్తున్నాయి. భీమాస్ హోటలు ముందు కార్ల రద్దీ మాత్రం తగ్గలేదు.

రైల్వే స్టేషనులోకి వెళ్ళాక, కొత్త బ్రిడ్జీ యెక్కి మూడో నెంబరు ఫ్లాట్‌ఫాంలో కొచ్చాడు పరమేశాచారి.

ముఖ్యమైన రైళ్ళన్నీ వెళ్లిపోవడంతో ఫ్లాట్‌ఫాంపైన మిగిలిన మనుషులు అక్కడే దుప్పట్లు పరుచుకుని నిద్రపోతున్నారు. ఫ్లాట్‌ఫాం చివరలో చీకటిగావున్న సిమెంటు బెంచీ ముందు యినప మంచాన్నీ, మూటనూ దించాడు పరమేశాచారి. భార్యతలపైని మూటను దించిపెట్టాక, కుర్రాడి నెత్తిపైని స్టూలును టీవీతో సహా ఫ్లాట్‌ఫాంపైకి దించాడు.

పిల్లలిద్దరూ సిమెంటు బెంచీపైన సర్దుకుని పడుకున్నారు. భార్య వాళ్ళ కాళ్ళదగ్గర కూర్చుంది. పరమేశాచారి బీడీ వొకటి వెలిగించి, రెండుదమ్ములు లాగాడు. దాన్ని చివరిదాకా తగలేశాక, దానిపీకతో మరోబీడీని అంటించుకున్నాడు.

నోట్లోంచీ పొగ సుళ్ళు తిరుగుతూ బయటికొస్తూండగా "కదిరిలో వుండే టింబరు డిపోలు నేరుగా బలార్షానించే లారీలతో టేకును తెప్పిస్తాయి. వొకిటోరకం టేకు .." అంటూ మెదలెట్టాడు పరమేశాచారి. "కిటికీలు జేసినా, తలుపులు జేసినా కుది మట్టంగా మెరస్తాయి. రోజువుడ్డుగావాలంటే నంద్యాలనించీ, బయిం లేకుండా తెచ్చిచ్చేవాళ్ళుండారు. సోఫాలు జేస్తే యాభై యేండ్లయినా అవి కొత్తవిగానే వుండిపోవాల్ల ... అసలు టేకూ రోజువుడ్డూ దొరక్కపోయినా యేంలే! ఆ పక్క గండి అడువుల్లో యేపకొయ్య మానావిరిగా దొరికితింది. బాగా చేవెక్కిన యేపకొయ్యతో తలుపులూ దాలబందరాలూ జేస్తే వాటి ముందు మిగిలిన కొయ్యేదైనా బలాదూర్! పనిజేస్తే మట్టంగా దిట్టంగా వుండాలి. లేకపోతే నాకు పనిరాదని వొప్పుకోవాల్ల. చేసిన పనిలో యెవులైనా వక్రంజూపిస్తే తలగొట్టేసినట్టే! దానికంటే మించిన బొగసాట్లేముండాయి? యింటికి టేకు మాన్లు దెప్పించినారే అనుకో! రవంత గద్దు చెక్కను గూడా బీరు పోనీకుండా యేమేం జెయ్యచ్చునో అవన్నీ చెయ్యాల! యెప్పుడో యిరవయ్యి ముప్పయ్యేండ్లు అయినాంక నువ్వు నీ చేతుల్లో చేసిన వురువుల్ని జూసినావే అనుకో! అవ్విట్ని నువ్వు గుర్తుపట్టే కావాల్ల! అసలు నీదాంకా యెందుకు? నీకేగాని చెవులుంటే అవి చాన్నాళ్ళయినాంక నిన్ను చూసిన ఆనందంతో గట్టిగా నీ పేరు పెట్టిపిలిచేది నీకు యినిపించే కావాల్ల! ..."

"వస్తా వస్తా యీ మనిషి నాలుగు దరాములేసుకొని వచ్చినట్టుండాడు" అని గొణుక్కుంది పరమేశాచారి భార్య. అతను చీకటి ఫ్లాట్‌ఫాంపైన నిలబడి పెద్దగా చేతులు తిప్పుతూ మాట్లాడుతూనే వున్నాడు.

**జనవరి అరుణతార 2006.**